బౌరంపేటలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

దుండిగల్, మార్చి19 : ప్రభుత్వ భూముల్లో వెలసిన అక్రమ నిర్మాణాలపై గండి మైసమ్మ- దుండిగల్ మండల రెవెన్యూ అధికారులు కొరడా ఝుళిపించారు. మండల పరిధి, బౌరంపేట లోని ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నట్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తడంతో బుధవారం చర్యలకు ఉపక్రమించారు. ఈ సందర్భంగా సర్వేనెంబర్ 575లో నిర్మించిన రెండు నిర్మాణాలతో పాటు 580లో నిర్మించిన మరో నిర్మాణాన్ని అధికారులు నేలమట్టం చేశారు. అదేవిధంగా మరో మూడు బేస్మెంట్లను కూల్చివేశారు. ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే ఉక్షించేది లేదని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.

అదుపుతప్పిన టిప్పర్..
రోడ్డుపై ట్రాఫిక్ జామ్

దుండిగల్ : మియాపూర్-గండి మైసమ్మ చౌరస్తా రోడ్డులో బుధవారం మధ్యాహ్నం భారీగా ట్రాఫిక్ స్తంభించింది. బౌరంపేట - సూరారం క్రాస్ రోడ్ స్నేక్ పార్క్ వద్ద మియాపూర్ వైపు నుంచి గండి మైసమ్మకు పైపు వెళ్తున్న ఓ టిప్పర్ అదుపు తప్పి రోడ్డుపై నిలిచిపోవడంతో ఇరువైపులా భారీగా ట్రాఫిక్ స్తంభించింది. సమాచారం అందుకున్న జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకున్నారు. రోడ్డుపై నిలిచిన టిప్పర్‌ను పక్కకు జరిపి ట్రాఫిక్ ను క్లియర్ చేశారు. దీంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం తగదు

సమావేశంలో మాట్లాడుతున్న కూకట్‌పల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొట్టు విష్ణు, బాలానగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు దర్శనం శాఖయ్య

బాలానగర్, మార్చి 18 : కూకట్‌పల్లి నియోజకవర్గం ప్రజలకు విశేష సేవలు అందిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుపై కాంగ్రెస్ నాయకుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి ఆధారాలు ఆరోపణలు చేయడంపై కూకట్‌పల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొట్టు విష్ణు, బాలానగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు దర్శనం శాఖయ్యలు ఖండించారు. బుధవారం బాలానగర్‌లో విలేకరులతో మాట్లాడారు. నియోజక వర్గానికి ఎలాంటి సంబంధం లేని వ్యక్తి ఎమ్మెల్యేపై ఆధారల్లేని ఆరోపణలు చేయడం యుగంధర్ రెడ్డి దివాలా కోరుతనానికి నిదర్శనమన్నారు. సోషల్ మీడియాలో నిరాధారమైన పోస్టింగులు చేయడం కాదు.. అసలైన రాజకీయాలు చేయాలంటే ప్రత్యక్ష రాజకీయాల్లో ఉండి ప్రజలకు సేవలు అందించాలి సూచించారు. నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్ మెప్పు పొందడానికి ప్రజాక్షేత్రంలో ఉన్న ఎమ్మెల్యేపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. 35 ఏండ్లుగా ప్రజా క్షేత్రంలో ఉండి, ఎమ్మెల్యేగా ప్రజలకు సేవలు అందిస్తున్న నాయకుడిపై ఆరోపణలు చేయడం మానుకోవాన్నారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుపై తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. నియోజకవర్గం పై ఏమాత్రం అవగాహన లేని వ్యక్తులు తమ పబ్బం గడుపుకోవడానికి విమర్శలు చేస్తే గొప్పవారు అవుతారా.. అని ప్రశ్నించారు. ఖబర్దార్ యుగంధర్ రెడ్డి .. నీ చవక బారు ఆరోపణలు ప్రజలు నమ్మే స్థితిలో లేరని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌కు సరైన నాయకుడు లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి పదవులు కట్టబెట్టడం వలన ఇలాంటి పరిస్థితులు నెలకొన్నాయని ఎద్దేవా చేశారు. తెలంగాణ ప్రజలు విస్తుపోతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు ఎన్వీ రత్నం, ఎడ్ల ప్రభాకర్, కృష్ణ, దగ్గుబాటి వెంకటేశ్, పుట్టపాక మధు, మల్లేశ్, సామెల్, నాగరాజు, కృష్ణ, అనురాధ పాల్గొన్నారు.

ప్రజలను దగా చేసే బడ్జెట్..

కొండాపూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రవీందర్ యాదవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బడ్జెట్ పేదల కష్టాలను తీర్చేదిగా లేదని, ఢిల్లీకి మూటలు పంపేలా ఉందని మండిపడ్డారు. ఆకాశం నుంచి పాతాళానికి బడ్జెట్ పోతుందని, పరిపాలన చేతకాని ప్రభుత్వమని విమర్శించారు. రాష్ట్రాన్ని ఆగం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీలు గోవిందా అని, హామీలకు పాతర వేశారన్నారు. మహిళలు, వృద్ధులకు ఇచ్చిన హామీలు ప్రస్తావించకపోవడం అన్యాయమన్నారు. తులం బంగారంకు దిక్కు దివానా లేదన్నారు. స్కూటీలు ఇస్తామని చెప్పి, బడ్జెట్లో కేటాయించకుండా ఎలా ఇస్తారని నిలదీశారు. చేనేత కార్మికులకు 300 కోట్లు కేటాయిస్తూ అన్యాయం చేశారన్నారు. ఆటో కార్మికులను ఆదుకుంటామని ప్రకటనలు చేసిన సర్కార్ ప్రస్తావనే లేదన్నారు. యాదవులకు ఇచ్చిన హామీలకు నిధులను కేటాయించకపోవడం కరెక్ట్ కాదన్నారు. దళితులను మరోసారి దగా చేశారని మండిపడ్డారు. నిరుద్యోగులకు నిధులు కేటాయించలేదని మండిపడ్డారు. నిరుద్యోగ భృతిపై ఒక్కమాట లేదని, ఉద్యోగాలు ఇచ్చింది కేసీఆర్ అయితే కేవలం అపాయింట్ లెటర్లు ఇచ్చి తామే ఇచ్చినట్లుగా గొప్పలు చెప్పుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా భరోసాపై ప్రస్తావించలేదని మండిపడ్డారు. గురుకుల పాఠశాలలో పిల్లలు చనిపోతే పట్టించుకోలేదని, అలాంటి ప్రభుత్వం రాష్ట్రంలో ఉండటం దురదృష్టకరమన్నారు. ట్రిలియన్ డాలర్‌లో ఎన్ని సున్నాలు ఉంటాయో తెలియని నాయకులు రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నారని, వారి పాలనలో ట్రిలియన్ డాలర్లకు తీసుకువెళ్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజల కష్టాలను తీర్చేది కాదన్నారు. కేసీఆర్ పాలనలోనే స్వర్ణయుగంగా సాగిందని, ప్రజల సమస్యలను తీర్చడంతో పాటు సరైన సంక్షేమాన్ని అందించారని రవీందర్ యాదవ్ కొనియాడారు.

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రవీందర్ యాదవ్

విద్యారంగానికి కేటాయింపులు
తగ్గింపులు సరికాదు

మియాపూర్ : విద్యారంగానికి బడ్జెట్లో రాష్ట్ర ప్రభుత్వం కేటాయింపులను తగ్గించడం సరికాదని టీఎస్ యూటీఎఫ్ మేడ్చల్ జిల్లా కోశాధికారి గొడుగు శ్రీనివాస్ పేర్కొన్నారు. కేటాయింపుల పరంగా అంకెల్లో ఎక్కువ ఉన్నప్పటికీ, గతేడాది కంటే తగ్గిందని తెలిపారు. బుధవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. విద్యారంగానికి 15 % నిధులను కేటాయించాలని అప్పుడే ప్రభుత్వ పాఠశాలల్లో బలోపేతమై నిరుపేద వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య లభిస్తుందన్నారు. తెలంగాణలో 26,057 ప్రభుత్వ పాఠశాలలు నడుస్తుండగా , వాటిని విస్మరించి కేవలం గురుకులాలు , యంగ్ ఇస్తాన్ పాఠశాలల విషయం ప్రభుత్వం మాట్లాడుతుండడం సమంజసం కాదని శ్రీనివాస్ అన్నారు. గురుకులాల్లో 5.5 లక్షల విద్యార్థులు మాత్రమే చదువుతుండగా, జిల్లా, మండల పరిషత్ పాఠశాలలో 16 లక్షలకుపైగా విద్యార్థులు చదువుతున్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని శ్రీనివాస్ కోరారు.. కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న విధంగా విద్యారంగానికి 15 శాతం నిధులను కేటాయించి నాణ్యమైన విద్యను మెరుగైన వసతులను కల్పించాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

కూకట్‌పల్లి నియోజకవర్గంలోని రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఈఆర్వో వంశీకృష్ణ

పారదర్శకంగా ఓటరు జాబితా

కేపీహెచ్‌బీ కాలనీ : పారదర్శకమైన ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని కూకట్‌పల్లి నియోజకవర్గం ఈఆర్వో (డిప్యూటీ కమిషనర్) బి.వంశీకృష్ణ కోరారు. బుధవారం మూసాపేట సర్కిల్ ఆఫీస్‌లో నియోజకవర్గానికి చెందిన రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని.. యువతీ యువకులందరికీ అవగాహన కల్పించాలని కోరారు. ఓటరు జాబితాలో చనిపోయిన వారి పేర్లను, డూప్లికేట్ ఓట్లను తొలగించడం జరుగుతుందన్నారు. చిరునామాలో.. పేరులో తప్పులు ఉన్న సవరించుకోవాలన్నారు. జాబితాలో ఆయా ప్రాంతాల్లో డూప్లికేటు ఓట్లను గుర్తిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. ముఖ్యంగా రాజకీయ నాయకులు బూత్‌స్థాయి ఏజెంట్ల జాబితాను అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఆర్వోలు, ఆయా రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

దశలవారీగా అభివృద్ధి పనులు

సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ సబీహాబేగం

అల్లాపూర్, మార్చి 19 : అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేసేందుకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో కృషి చేస్తానని కార్పొరేటర్ సబియాబేగం అన్నారు. అల్లాపూర్ డివిజన్‌లో సమస్యలు, పెండింగ్, అభివృద్ధి పనులపై సంక్షేమ సంఘాల ప్రతినిధులతో కార్పొరేటర్ వార్డు కార్యాలయంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సమస్యలపై సంక్షేమ సంఘం నాయకులు కార్పొరేటర్‌కు వినతి పత్రాలు అందజేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఎన్యుమరేటర్ల ధర్నా

కుత్బుల్లాపూర్ : కుటుంబ సర్వే చేసిన ఎనుమరేటర్లకు వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఉన్నతాధికారులు స్పందించి తమకి రావాల్సిన బకాయిలను చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సెయింట్ మార్టిన్ కళాశాలలో ఇఫ్తార్..

కుత్బుల్లాపూర్ : దూలపల్లి సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాలలో హిందూ ముస్లింల స్నేహభావానికి ప్రతీకగా రంజాన్ సందర్భంగా బుధవారం ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ప్రొఫెసర్, గ్రూప్ డైరెక్టర్ డాక్టర్ పి.సంతోష్‌కుమార్ పాత్ర కార్యక్రమం నిర్వహించినందుకు యాజమాన్య సభ్యులు, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. 100 మంది విద్యార్థులు, సిబ్బందికి ఖర్జూరాలు, పండ్లు, స్నాక్స్, రుచికరమైన వంటకాలు అందించారు. కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జి. చంద్రశేఖర్ యాదవ్ ముస్లిం సమాజానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

దుండిగల్‌లో గ్రంథాలయం ప్రారంభం

దుండిగల్ : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ మున్సిపాలిటీ పరిధి, దుండిగల్‌లో బుధవారం నూతన గ్రంథాలయం (పౌర పఠన మందిరం)ను ప్రారంభించారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి సురేశ్ మండల్, కుతుబుల్లాపూర్ మండల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు కావలి గణేశ్, మాజీ కౌన్సిలర్ గోపాల్ రెడ్డి, నాయకులు ముత్యం రెడ్డి, జక్కుల మల్లేశ్ యాదవ్, వెంకటేశ్, బాలరాజు, విఘ్నేశ్వర్, నరసింహ ,మోహన్ ,కృష పాల్గొన్నారు.

నలుగురికీ ఆదర్శంగా నిలవాలి

విద్యార్థులకు విద్యాసామగ్రిని అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ సాయిబాబా

శేరిలింగంపల్లి : పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించి విద్యార్థులు నలుగురికీ ఆదర్శంగా నిలువాలని గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిషెట్టి సాయిబాబా అన్నారు. బుధవారం భాజాగూడలోని జడ్పీహెచ్ఎస్‌లో పదోతరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమానికి సాయిబాబా ముఖ్యఅతిథి విచ్చేశారు. కొమిరిశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో లో ఎగ్జామ్ ప్యాడ్, పెన్, పెన్సిల్, జామెట్రీ బాక్స్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజశేఖర్ రెడ్డి, ఏఎస్ఐ ఎండీ రహీం, గాలి నరహరి, రాంభూపాల్ రెడ్డ్, సయ్యద్ అహ్మద్, జ్యోత్స్న, వీణమ్మ, వెంకటేశ్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని క్లినిక్‌లు సీజ్

క్లినిక్‌ను సీజ్ చేస్తున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఉమాగౌరి

దుండిగల్ : క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టాన్ని ఉల్లంఘించి ఫస్ట్ ఎయిడ్ సెంటర్ల పేరుతో వైద్యశాలలు నిర్వహిస్తున్న వారిపై మేడ్చల్ జిల్లా డీఎం అండ్ హెచ్‌వో కొరడా ఝుళిపించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోనిమూడు క్లినిక్‌లను సీజ్ చేశారు. బాచుపల్లిలోని బుచ్చిబాబు క్లినిక్ (ఫస్ట్ ఎయిడ్ సెంటర్), సహజ పాలిక్లినిక్‌తోపాటు జగద్గిరిగుట్టలోని హాసిని ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. ఉమాగౌరి బుధవారం సీజ్ చేశారు. ఆమె మాట్లాడుతూ.. ప్రజారోగ్యానికి ప్రమాదం కలిగించేలా అనియంత్రిత వైద్య సేవలను అందిస్తున్నట్లు పరిశీలనలో తేలిందన్నారు. ఎటువంటి విద్యార్హతలు, అనుభవం లేకుండానే జనరల్ ఫిజీషియన్‌గా అల్లోపతి మందులు, యాంటీబయాటిక్స్ రాయడం, సెలైన్ ఎక్కించడం చేస్తూ ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. ఇటువంటి క్లినిక్‌లపై క్రమం తప్పకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అదే సమయంలో నకిలీ వైద్యులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆమెతోపాటు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ట్ గ్యాలరీలో..

కొండాపూర్ : మాదాపూర్ లోని చిత్రమై స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో బుధవారం కళాకారుడు రాబిన్ డేవిడ్ రూపొందించిన కల్చర్‌తో 'స్కల్ప్చింగ్ వైడ్స్' పేరిట సోలో ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి తెలంగాణ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్, ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కే లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై ప్రదర్శనను ప్రారంభించారు. ప్రదర్శనను అమన్ ప్రీత్‌కౌర్ ఆధ్వర్యంలో ఈనెల 30 వరకు కొనసాగన ఉందని తెలిపారు. ప్రదర్శనలో 30 స్కల్చర్స్ సందర్శనకు అందుబాటులో ఉంచారు.

కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో బుధవారం కూరగాయల ధరలు (కేజీ - రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 11, వంకాయ 18, బెండ 45, పచ్చిమిర్చి 45, బజ్జి మిర్చి 28, కాకర 45, బీర 35, క్యాబేజీ 10, ఫ్రెంచ్ బీన్స్ 45, క్యారెట్ 17, కాలీఫ్లవర్ 18, దొండ 40, చిక్కుడు 45, గోరుచిక్కుడు 35, బీట్ రూట్ 13, క్యాప్సికం 40, ఆలుగడ్డ 24, కీరా 16, దోస18, సోర 15, పొట్లకాయ (1) 16, కందగడ్డ 70, ఉల్లిపొరక 35, ఉల్లిగడ్డ 24, మామిడికా య(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 9, చామగడ్డ 45, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 30, గుమ్మడి 30, నిమ్మకాయలు (12) 50 నుంచి 60, మునగ (1) 5 నుంచి 6, పచ్చి బఠానీ 45, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 160, అల్లం 60, వెల్లుల్లి 140, చింతపండు 140, కరివేపాకు 100గా ఉన్నాయి. ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

విద్యా ప్రమాణాలు పెంపొందించాలి

కేపీహెచ్‌బీ కాలనీ, మార్చి 19: అంతర్జాతీయ విద్యా ప్రమాణాలను నిర్ధారించడంలో ఎన్‌బీఏ కీలకమైనదని ఎన్‌బీఏ చైర్మన్ అనిల్ డి సహస్ర బుద్ధే అన్నారు. బుధవారం జేఎన్టీయూహెచ్ వర్సిటీలో అవుట్ కమ్ బేస్డ్ ఎడ్యూకేషన్ అండ్ అక్రిడేషన్ వర్క్ షాప్ ను నిర్వహించారు. వర్సిటీ ఐక్యుఏసీ (వాటర్ రిసోర్స్) డైరెక్టర్ ఎంవీఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా ఎన్‌బీఏ చైర్మన్ అనిల్ డి సహస్ర బుద్ధే, వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డి. కిషన్ కుమార్ రెడ్డి, రెక్టార్ విజయ్‌కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ఎన్‌బీఏ సెక్రెటరీ మెంబర్ అనిల్ కుమార్, ఒరిస్సా ఓపెన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఎస్.ఎస్.పట్నాయక్, ఎం.ఎస్ . రామయ్య యూనివర్సిటీ డీన్ ఆర్.వి. రంగనాథ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గ్రాడ్యుయేట్ అట్రిబ్యూట్స్ ప్రొఫెషనల్ కాంపిటెన్సీస్ వెర్షన్ 4 ప్రవేశపెట్టామని, ఎన్‌బీఏ ప్రోగ్రాం అవుట్ కమ్, స్వీయ మూల్యాంకన నివేదికలో మార్పులు చోటు చేసుకున్నట్లు తెలిపారు. వర్సిటీ వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ.. ఆచార్యుల నియామక లోపం ఆర్థిక పరిమితులు క్లిష్టమైన గుర్తింపు విధానాలు ప్రధాన సమస్యలుగా ఉన్నాయని తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యూలర్ ఫ్యాకల్టీగా పరిగణించాలని తద్వారా స్టూడెంట్ ఫ్యాకల్టీ రేషియో లెక్కింపు సమయంలో అనుకూలంగా ఉంటుందని ఎన్‌బీఏ అధికారులను కోరారు. అలాగే ఎన్‌బీఏ యూజీసీ ఏఐసీటీయూ ఫార్మసీ కౌన్సిల్ లాంటి సంస్థలు విలీనమై సమగ్ర గుర్తింపు విధానం తీసుకురావాలని కోరారు.



జేఎన్టీయూహెచ్‌లో జరిగిన సదస్సులో పాల్గొన్న అనిల్ సహస్ర బుద్ధే, కిషన్ కుమార్ రెడ్డి, విజయ్‌కుమార్ రెడ్డి, వెంకటేశ్వరరావు

శేరిలింగంపల్లి : చైల్డ్ అండ్ ఉమెన్ వెల్ఫేర్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ మోతీ రాజీవ్ గృహకల్పలో సెంటర్ ఫర్ వరల్డ్ సోల్డారిటీ చైల్డ్ ఫండ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా వాని మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు.

బాలానగర్ : బాలానగర్ లో మహిళా దినోత్సవం సందర్భంగా సుజాత గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రభా రెడ్డి జ్యోతి రెడ్డి స్వాతి మందడి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు
కారులో మంటలు

దుండిగల్ : ప్రమాదవశాత్తూ కారులో మంటలు చెలరేగిన ఘటన దుండిగల్ పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ లోని మాతృశ్రీ నగర్ లో నివాసము ఉంటున్న ఉపాధ్యాయురాలు కల్పనరాణి, తన కూతురుకు బౌరంపేటలోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ పరీక్ష కేంద్రం ఉండటం తో బుధవారం తన కారు (ఏపీ 28, బీఎస్1362) లో ఉదయం తీసుకు వచ్చింది. పాప లోనికి వెళ్లగా కారును కల్పన రాణి కారును పార్క్ చేసింది. కొద్దిసేపటికి కారు ఇంజిన్‌లో మంటలు చెలరేగాయి. కల్పనరాణి దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో
ఎలక్ట్రీషియన్ మృతి

శేరిలింగంపల్లి : విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి చెందిన ఘటన గచ్చిబౌలి పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు.. కొండాపూర్, శ్రీరాంనగర్ ఏ - బ్లాక్ లోని ప్లాట్ నం.347 యజమాని విజయ్ ట్రాన్స్ ఫార్మర్ బిగింపు పనులను రఘుబాబుకు అప్పగించాడు.తూర్పుగోదావరి, గోపవరం మండలం, ఇటుకలపల్లి కి చెందిన ఎలక్ట్రీషియన్ బత్తిని రామకృష్ణ (32) జేఎన్టీయూ అడ్డగుట్టలో భార్య భవానితో నివాసం ఉంటున్నాడు. బుధవారం ఉదయం 7:30 గంటలకు ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాలు పాతేందుకు వెళ్లాడు. అతనితో రాంబాబు, రామ్ పనులు చేస్తున్నారు. మధ్యాహ్నం 3:50 గంటలకు స్తంభాన్ని పాతుతుండగా 11 కె.వి. లైన్ తాకడంతో విద్యుదాఘాతానికి గురయ్యారు. రామకృష్ణ అపస్మారక స్థితికి చేరుకోవడంతో కొండాపూర్ దవాఖానకు తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. గాయాల పాలైన రాంబాబును కూకట్‌పల్లిలోని రాందేవ్ దవాఖానకు తరలించారు. కాంట్రాక్టర్ రఘురాం పట్టించుకోలేదని మృతుడి బంధువులు ఆరోపించారు. మృతుడికి భార్య, కొడుకు సాయిచరణ్ , కూతురు అపర్ణ ఉన్నారు.

యువకుడి ఆత్మహత్య..

కేపీహెచ్‌బీ కాలనీ : ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కేపీహెచ్‌బీ కాలనీ పీఎస్ పరిధిలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా, గోపాలపురం మండలం, వెదులకుంటకు చెందిన కోరుకొండ చంద్రశేఖర్ (24) ఉద్యోగం కోసం హైదరాబాదుకు వచ్చాడు. ఓ ప్రైవేట్ సంస్థలో ఏడాదిగా ఉద్యోగం చేస్తూ కేపీహెచ్‌బీ కాలనీ నాలుగో రోడ్డులోని ఓ హాస్టల్లో ఉంటున్నాడు. ఈనెల 18న రాత్రి తాను ఉంటున్న హాస్టల్ గదిలో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రేమ విఫలమై మనస్థాపంతో మృతి చెంది ఉంటాడని తండ్రి రామచందర్రావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బాగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలి

దుండిగల్, మార్చి 19: విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకొని జీవితంలో స్థిరపడాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ మేయర్ కొలన్ నీలా గోపాల్ రెడ్డి అన్నారు. నిజాంపేటలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షిక వేడుకలు బుధవారం జరిగాయి. వేడుకలకు నీలగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాఠశాల అధ్యాపకులను ఆమె అభినందించడంతోపాటు సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థు లను ఉత్తములుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. విద్యార్థులు సైతం చిన్ననాటి నుంచి లక్ష్యాన్ని ఎంచుకొని బాగా చదివితే భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చు అని అన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన, చదువుతో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మేయర్ కొలన్ నీలా గోపాల్ రెడ్డి